

స్పందనకు 96 దరఖాస్తులు

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని సంయుక్త కలెక్టరు ఒ.ఆనంద్ జిల్లా అధికారులను ఆదేశించారు. స్పందనలో వచ్చిన అర్జీలపై చర్యలు గూర్చి సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడి, అర్జీదారులకు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో 96 అర్జీలు అందాయి. విభిన్న ప్రతిభావంతులకు కలెక్టరు కార్యాలయం సెల్లారులో గల సమావేశమందిరంలో ప్రత్యేక స్పందనకార్యక్రమం నిర్వహించగా డిఆర్ఒ జె.వెంకటరావు వారి నుండి అర్జీలను స్వీకరించారు.

ఉత్సాహంగా ఆశావర్కర్ల మహాసభ

- నగరంలో భారీ ప్రదర్శన
- ఉద్యోగభద్రత, కనీస వేతనాల కోసం ఐక్య ఉద్యమం
- ఆశా కార్యకర్తలకు అండగా ఉంటాం
- బహిరంగ సభలో వక్తలు
- యూనియన్ జెండాను ఆవిష్కరించిన రాష్ట్ర అధ్యక్షులు పోసమ్మ

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ 4వ రాష్ట్ర మహాసభ అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో సోమవారం ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన ఆశావర్కర్లతో నగరమంతా సందడిగా మారింది. ఎర్రజెండా చేతబట్టి తమ సమస్యలు పరిష్కరించాలని చేసిన నినాదాలతో నగరం మార్మోగింది. మహాసభ సందర్భంగా వందలాది మంది ఆశా కార్యకర్తలు భారీ ప్రదర్శన నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమైన ప్రదర్శన మయూరి జంక్షన్, ఆర్‌టిసి కాంప్లెక్స్, బాలాజీ జంక్షన్ మీదుగా గురజాడ కళాభారతి వరకు కిలోమీటరు పొడవునా సాగింది. ప్రదర్శన అగ్రభాగంలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి, అధ్యక్షులు పోసమ్మ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరామమ్మ, సిఐటియు నాయకులు నడిచారు.



ప్రదర్శనలో పాల్గొన్న ఆశా వర్కర్స్ యూనియన్, కార్మిక సంఘాల నాయకులు, ఆశాలు



బహిరంగ సభలో మాట్లాడుతున్న అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కళాభారతి ఆడిటోరియంలో ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోసమ్మ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ఇచ్చే నిధులకు కోత పెడుతోందని, రాష్ట్రాల హక్కులను హరిస్తోందని అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా వచ్చిన ఆశా వర్కర్లు రాష్ట్రంలో ఉండాల్సిన వారి కంటే తక్కువగా ఉన్నారని, ఫలితంగా పని భారం పడుతోందని అన్నారు. ఆశా వర్కర్లకు కేవలం రూ.10వేలు వేతనం ఇవ్వడం అన్యాయమని, 7వ వేతన సంఘం సిఫార్సు మేరకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరో వైపు ప్రజలు ఐక్యంగా ఉండి సమస్యలపై పోరాడకుండా కులం, మతం పేరుతో విభజన రాజకీయాలు మోడీ ప్రభుత్వం చేస్తుందన్నారు. మరో వైపు జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సమస్యలపై అడిగితే ప్రభుత్వం నిర్బంధాలకు పాల్పడుతోం దన్నారు. ఆశా వర్కర్లకు రిటైర్మెంట్ బెన్ఫిట్స్, పెన్షన్ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు మాదిరిగానే సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కోసం ఆశావర్కర్లు చేసే పోరాటానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీల మంతా అండగా ఉంటామన్నారు.

యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనాలు, సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం, ఉద్యోగ భద్రత కల్పించకపోవడం అన్యాయమని అన్నారు. ఆశా వర్కర్లు చేసిన సేవలను గుర్తించకుండా ఆత్మాభిమానం దెబ్బతీసే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఆశా వర్కర్లను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనాలు రూ.26వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇతర పనులు నుంచి తప్పించాలన్నారు. ఆశా వర్కర్లను పట్టించుకోకపోతే కుర్చీలు కదలుతాయని హెచ్చరించారు. రాష్ట్ర అధ్యక్షులు కె.పోసమ్మ మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై మహాసభలో చర్చించి పోరాట కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సబ్బరావమ్మ మాట్లాడుతూ కరోనా సమయంలో. సేవలు అందించిన ఆశా వర్కర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాలన్నారు. నేడు అనేక పరిశ్రమల్లో కార్మికులను తొలగించడం, పరిశ్రమలను మూసేయడం, స్టీల్ ప్లాంట్ అమ్మేయడం వంటి పాలన సాగుతుంద న్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా జనవరి 6న జరిగే దేశ వ్యాప్త పోరాటాలకు స్కీమ్ వర్కర్లు సిద్ధం కావాలని ఆమె పిలుపునిచ్చారు. ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.సుధారాణి మాట్లాడుతూ పోరాట ఫలితంగానే యూనిఫాం, బకాయిలు సాధించుకున్నా మన్నారు.కోవిడ్ సమయంలో ఇద్దరు ఆశా వర్కర్లు చనిపోతే పోరాడి రూ.50 లక్షలు చొప్పున ఎక్స్ గ్రేషియో సాధించుకున్నామన్నారు. విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తామని తెలిపారు. సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు టివి రమణ మాట్లాడారు.





బహిరంగ సభలో మాట్లాడుతున్న ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోసమ్మ, ధనలక్ష్మి



బహిరంగ సభకు హాజరైన ఆశా కార్యకర్తలు



అమరవీరుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యూనియన్ నాయకులు



ఆకట్టుకున్న ఆశా కార్యకర్తల కోలాటం

ఆర్థిక సంస్కరణల్లో మార్పుతోనే
స్కీమ్‌వర్కర్లకు న్యాయం

నిరంజనా నిరూలా నగర్ మల్లు స్వరాజ్యం ప్రాంగణంలో (ఎస్.కన్వెన్షన్) వేదికగా మహాసభ సోమవారం ప్రారంభమైంది. తొలుత యూనియన్ జెండాను రాష్ట్ర అధ్యక్షులు కె.పోసమ్మ ఎగురవేశారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద నాయకులు, ప్రతినిధులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ప్రతినిధుల సభలో ముందుగా మల్లు స్వరాజ్యం, అలిండియా ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు రంజానా నిరూలా మృతికి, కరోనాతో చనిపోయిన ఆశా కార్యకర్తల మృతికి నివాళులర్పించారు. అనంతరం ప్రతినిధులనుద్దేశించి పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ప్రారంభ ఉపన్యాసం చేశారు. నూతన ఆర్థిక విధానాలతో ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసి, ప్రైవేట్, కార్పొరేట్ రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. పోరాడి ఏర్పాటు చేసుకున్న స్టీల్ ప్లాంట్‌ను అమ్మేయడానికి మోడీ ప్రభుత్వం చూస్తోందన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కూడా స్టీల్ ప్లాంట్, గంగవరం పోర్టు, కృష్ణపట్నం వద్ద థర్మల్ స్టేషన్‌ను అదానీకి అమ్మేస్తున్నారన్నారు. విభజన హామీలు అమలు చేయడంలో కేంద్రం నిర్లక్ష్యంగా ఉన్నా రాష్ట్రంలో అధికార,ప్రతిపక్ష పార్టీలు పట్టించుకోవడంలేదని అన్నారు. ఆర్థిక సంస్కరణల్లో మార్పులు వస్తే తప్ప స్కీం వర్కర్లకు, కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం జరగదన్నారు. ప్రభుత్వ విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించాలని కోరారు.

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ నూతన విద్యా విధానం తీసుకొచ్చి అంగన్వాడీ కేంద్రాలను తగ్గించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఐక్యంగా పోరాడితే తప్ప మనకి మనుగడ ఉండదని, సాధించుకున్న హక్కులు, చట్టాలను కాపాడుకోలేమని అన్నారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు అవసరమని, ఆ దిశగా చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వరలక్ష్మి మాట్లాడుతూ హక్కులు గురించి అడిగితే ప్రభుత్వం నిర్బంధం విధిస్తోందన్నారు. స్కీం వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఐక్యంగా పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు.

పని ఒత్తిడి తగ్గించాలని విఆర్‌ఒల నిరసన

ప్రజాశక్తి - సీతానగరం

పని భారాన్ని తగ్గించాలని కోరుతూ గ్రామ రెవెన్యూ అధికారులు (విఆర్ఒ) సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ ఎంవి రమణకు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా విఆర్‌ఒల సంఘ నాయకులు పి.కుమార్, కిరణ్ మాట్లాడుతూ భూ సర్వే తగ్గించాలని, విఆర్‌ఒల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మానసిక ఒత్తిడి పెరగడంతో పనులు సక్రంగా చేయలేకపోతున్నామని వాపోయారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. కార్యక్రమంలో విఆర్‌ఒలు ఎం.సింహాచలం, శ్రీనివాసరావు, నాగమణి, గణపతి పాల్గొన్నారు.

వీరఘట్టం: పని ఒత్తిడితో చనిపోయిన గ్రామ రెవెన్యూ అధికారుల కుటుంబాలకు రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని విఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.సింహాచలం డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ జె.మాధవికి వినతిపత్రం అందజేశారు. గ్రామ వీఆర్వోలకు పని భారం తగ్గించాలని, విఆర్ఎ నుంచి గ్రేటు విఆర్‌ఓగా పనిచేస్తున్న 3795 మంది గ్రామ రెవెన్యూ అధికారులకు తక్షణమే ప్రొఫెషన్ డిక్లరేషన్ చేసి స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు జి.అప్పల నాయుడు, జి.రాజేంద్రప్రసాద్, పి రఘుకుమార్, జి.సురేష్ పాల్గొన్నారు.

మక్కువ : తమపై పని ఒత్తిడి తగ్గించాలని స్థానిక తహశీల్దార్ సూర్యనారాయణకు విఆర్‌ఒలు వినతిని అందజేశారు. వీఆర్వోల సంఘం మండల అధ్యక్షులు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వినతిని అందజేశారు. సమస్యలపై మంగళవారం నుంచి నిరసన కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల వీఆర్వోలంతా పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైన్స్ కాంగ్రెస్‌కు జిల్లా ప్రాజెక్టు ఎంపిక

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్రస్థాయి 30వ జాతీయ పిల్లల సైన్స్ కాంగ్రెస్ 2022కు ఎంపికైన జియ్యమ్మవలస మండలం బిజెపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి బి.కేశవనాయుడును జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ అభినందించారు. ఇటీవల గూడూరులో గల ఆదిశంకర కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో 26 జిల్లాల నుంచి 182 ప్రాజెక్టులు ప్రదర్శనలో పాల్గొనగా, 17 ప్రాజెక్టులు జాతీయ స్థాయిలో పాల్గొనడానికి అర్హత సాధించాయి. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం బిజెపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బి.కేశవనాయుడు తయారు చేసిన పంట వ్యర్థాల నుండి సేంద్రీయ ఎరువుల తయారీ ప్రాజెక్టు జాతీయ స్థాయికి ఎంపికైంది. ఈ ప్రాజెక్టు రూపకల్పనకు జీవశాస్త్ర ఉపాధ్యాయులు గౌతమి, బాల శాస్త్రవేత్త బి.కేశవ నాయుడు సూచనలు అందజేసి మార్గదర్శకత్వం చేశారు. ఈ ప్రాజెక్టు రూపకల్పనలో మార్గదర్శకం వహించిన ఉపాధ్యాయులను జెసి అభినందించారు. రాష్ట్ర పర్యాటక యువజన సాంస్కృతిక శాఖా మంత్రి ఆర్‌కె రోజా సెల్వమని, ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ బి.ప్రతాపరెడ్డి, ఆప్కోసెట్ మెంబర్ సెక్రటరీ డాక్టర్ వై.అపర్ణ, ప్రాజెక్టు మేనేజర్ ఢిలీశ్వరరావు తదితరుల సమక్షంలో గూడూరులో జరిగిన సమావేశంలో ప్రశంసా పత్రం మెమొంటో అందుకున్నారు. కార్యక్రమంలో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, డిఇఒ ఎస్‌డివి రమణ, ఉప విద్యాశాఖ అధికారి ఆర్.విజయకుమారి, పి.బ్రహ్మాజీ, జిల్లా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ పి.రామకృష్ణ, అకాడమిక్ కోఆర్డినేటర్ కె.అయ్యప్ప, జిల్లా సైన్స్ ఆఫీసర్ జి.లక్ష్మణ్ తదితరులు పాల్గొని అభినందించారు. వచ్చే ఏడాది జనవరి 27 నుంచి 31 వరకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఈ విద్యార్థి పాల్గొననున్నట్లు డిఇఒ తెలిపారు.



విద్యార్థిని, ఉపాధ్యాయులను అభినందిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆనంద్, ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్

తక్కువ ధరకు కొంటే కఠిన చర్యలు : జెసి

ప్రజాశక్తి - కలెక్టరేట్

పత్తిని గిట్టుబాటు కంటే తక్కువ ధరకే కొనుగోలు చేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ హెచ్చరించారు. పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి జెసికి స్పందన కార్యక్రమం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సాంబమూర్తి మాట్లాడుతూ పత్తికి గిట్టిబాటు ధర కల్పించి రైతు భరోసా కేంద్రాల్లో కాటన్ కార్పొరేషన్ ఇండియా ద్వారా ఇనాం ప్రాప్తికి కొనుగోలు చేసి రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. దీనికి జెసి స్పందించి వెంటనే వ్యవసాయ, ఇతర శాఖ అధికారులను పిలిపించి ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర కన్నా ఎవరైనా తక్కువ రేటుకు పత్తి కొనుగోలు చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అలాగే రైతు భరోసా కేంద్రాల్లో ఎవరైనా పత్తి అమ్మడానికి సిద్ధంగా ఉంటే ఆయా రైతుల పత్తి పంటను కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జెసికి సిపిఎం నాయకులు ధన్యవాదాలు తెలిపారు.

పత్తికి మద్దతు ధర

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు పత్తి రైతులు తమ పంటను అమ్ముకోవాలని మార్కెంటింగు శాఖ సహాయ సంచాలకులు అశోక్ కుమార్ తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ప్రకారం పత్తి క్వింటాళ్లకు పొడుగుపింజ రూ. 6380, పొట్టి పింజ రూ.6080 మద్దతు ధర లభిస్తుం దన్నారు. పత్తి నాణ్యతా ప్రమాణాలు ప్రకారం తేమ 8శాతం రూ.6380, 9శాతం రూ.6316, 10శాతం రూ.6252.40, 11శాతం రూ.6188.60, 12శాతం రూ.6124.80గా ఉన్నదని తెలిపారు.

గిరిజన ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాల్సిందే

ఐటిడిఎ వద్ద ధర్నాలో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన సంక్షేమ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ ఆధ్వర్యాన స్థానిక ఐటిడిఎ వద్ద ఉపాధ్యాయులు సోమవారం ధర్నా చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తూ ఐటిడిఎ గేటు వద్ద బైఠాయించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయుల బకాయి జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. జీతాల కోసం, సమస్యల పరిష్కారానికి పోరాడితే రాష్ట్ర ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందన్నారు. గత మూడేళ్లుగా ఒక సమస్య కూడా పరిష్కారం జరగలేదని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జీపు జాత చేసినప్పుడు అనేక సమస్యలు వచ్చాయని అన్నారు. ముఖ్యంగా ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు అర్థాకలితో ఉంచితే నాణ్యమైన విద్య ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఆశ్రమ పాఠశాలలో ఎఎన్ఎంలను నియమించాలని, సిఆర్‌టిలను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలన్నారు. ఆశ్రమ హైస్కూల్లో పండిట్ పోస్టులను అప్ గ్రేడ్ చేయాలన్నారు ఎంఇఒ, డిప్యూటీ డిఇఒ పోస్టులను గిరిజన ప్రాంతాల ట్రైబల్ వెల్ఫేర్ ఉపాధ్యాయుల ద్వారా భర్తీ చేయాలన్నారు. భాషా వాలంటీర్లను రెన్యువల్ చేయాలన్నారు. ఆశ్రమ హైస్కూల్లో ఖాళీగా ఉన్న హెచ్‌ఎం పోస్టులను స్కూల్ అసిస్టెంట్లకు ప్రమోషన్ ఇచ్చి భర్తీ చేయాలన్నారు. ఈ సమస్యలు పరిష్కరించకపోతే ఈనెల 22న విజయవాడ విద్యశాఖ డైరెక్ట్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరిం చారు. ఐటిడిఎ పిఒ నవ్య ఉపాధ్యాయుల వద్దకు వచ్చి ఈ సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్‌రావు, శ్రీకాకుళం అధ్యక్షులు పి అప్పారావు, రాష్ట్ర కౌన్సిలర్ కె.కృష్ణారావు, గౌరవ అధ్యక్షులు భాస్కరరావు, జిల్లా కౌన్సిలర్ పాలక కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. ధర్నాకు టిడిపి నాయకులు పడాల భూదేవి సంఘీభావం తెలిపారు.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న ఎన్.వెంకటేశ్వర్లు

సప్లిమెంటరీ ఫీజులు ఎక్కడ కట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్థానిక బాలుర ఆర్‌సిఎం పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్ష ఫీజులు ఎక్కడ కట్టాలని, ఆ విద్యార్థులకు పై చదువులు చదివే హక్కు లేదా అని ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు జిల్లా జాయింట్ కలెక్టరుకు విన్నవించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ విషయమై తొలుత ఎంఇఒను అడగ్గా మాకు తెలియదని చెప్పడంతో డిఇఒ వద్దకు వెళ్లారు. డిఇఒ కలెక్టర్ స్పందనలో ఉండడంతో నేరుగా కలెక్టరేట్‌కు చేరుకొని, కార్యాలయం బయట నిరసన చేపట్టారు. అనంతరం జెసికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.రాజశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలు మూసివేసే ప్రక్రియలో భాగంగా ఆర్‌సిఎం స్థానిక బాలుర, బాలికల పాఠశాలలు మూసివేశారని, దీంతో ఎంతోమంది పేద విద్యార్థులు ఈరోజుకీ చదువులకు దూరమయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలు మూసివేసి వాటికి సంబంధించిన పత్రాలన్నిటిని గవర్నమెంట్ బాలికల ఉన్నత పాఠశాలకు తరలించారని, ఇదే సందర్భంలో ప్రభుత్వం టెన్త్ విద్యార్థులకు సప్లమెంటరీ ఫీజులు కట్టుకునే అవకాశం కల్పించిందని తెలుసుకున్న విద్యార్థులు పరీక్ష ఫీజు కట్టేందుకు ప్రభుత్వ గర్ల్స్ హై స్కూల్‌కు వెళ్లగా, ఆ వెబ్ సైట్ మాకు తెలియదని చెప్పారన్నారు. విషయం తెలుసుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులు గర్ల్స్ స్కూల్ ప్రధాన ఉపాధ్యాయులను అడుగ్గా సప్లిమెంటరీ ఫీజు కట్టొచ్చు, కానీ ఆర్‌సిఎం విద్యార్థులకు అవకాశం లేదని విద్యాశాఖ అధికారులు చెబుతుండడం విడ్డూరంగా ఉందని వాపోయారు. ఇదే విషయంపై జాయింట్ కలెక్టరుని కలిసి 30 మంది విద్యార్థుల భవిష్యత్తు అంధకారంలో పడనున్నదని, ప్రభుత్వం పరీక్ష ఫీజు ఆఖరి తేదీ ఈనెల20కు ఇచ్చిందని, ఈలోగా ప్రత్యామ్నాయం చూపి పరీక్ష రాసే అవకాశం విద్యార్థులకు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ఎయిడెడ్ పాఠశాలలు మూసివేయడమే కాకుండా అక్కడున్న విద్యార్థులకు ఉన్నత చదువులు చదవడానికి అవకాశం కల్పించక పోవడం దారుణమని వెంటనే విద్యాశాఖ అధికారులు విద్యార్థుల పక్షాన నిర్లక్ష్య వైఖరి విడనాడి ప్రత్యామ్నాయ మార్గం చూపాలని, పరీక్ష ఫీజులు కట్టేందుకు రోజుల తరబడి ప్రభుత్వ బాలికల పాఠశాల ప్రధానోపాధ్యాయుల చుట్టూ తిరుగుతున్న కనీసం స్పందించకపోవడాన్ని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా ఖండిస్తుందని, వెంటనే ప్రధానోపాధ్యాయులపై తగిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె. భాస్కర్ విద్యార్థులు ఎన్. చందు, ఎ. వర్మ, బి. భారత్, కె మహేష్, డి కార్తీక్, ఎన్. దిలీప్ కుమార్ పాల్గొన్నారు.



డిఇఒ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు



యుటిఎఫ్ రూపొందించిన టెన్త్‌మోడల్ పేపర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంఇఒ

యుటిఎఫ్ మోడల్ టెస్ట్ పేపర్ ఆవిష్కరణ

వీరఘట్టం : యుటిఎఫ్ రూపొందించిన టెన్త్ మోడల్ టెస్ట్‌పేపర్లను ఎంఇఒ పి.కృష్ణమూర్తి సోమవారం ఆవిష్కరించారు. స్థానిక ఎంఇఒ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి బోధన చేస్తూ ఎన్నో ఏళ్ల అనుభవం ఉన్న ఉపాధ్యాయులు మోడల్ టెస్ట్ పేపరును తయారు చేయడం అభినందనీయమన్నారు. దీన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు, మండల కార్యదర్శి కురుమన గోవిందరావు, కోశాధికారి బి.వాసుదేవరావు, కార్యవర్గ సభ్యులు ఎస్.శ్రీనివాసరావు, కె.విమలకుమారి, ఎ.చంద్రమోహనరావు, నానిబాబు, తదితరులు పాల్గొన్నారు.

తప్పిన తుపాను ముప్పు

వీరఘట్టం : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మండలంలో గత మూడు రోజులుగా ఆకాశంలో మబ్బులు ఏర్పడడంతో అన్నదాతల గుండెలు గుబులుమన్నాయి. బుధవారం రోజంతా ఎండ ఎక్కడంతో మాండోస్ తుఫాను ప్రభావం తప్పిందని అన్నదాతలు ఊపిరి పీల్చుకున్నారు. దీంతో యథావిధిగా వరి కోత పనుల్లో బిజీగా ఉన్నారు. అయితే మండలంలో కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. యంత్రం ద్వారా నూర్పు చేయటానికి గంటకు రూ.4వేలు వరకు ఖర్చవుతుందని ఆందోళన చెందుతున్నారు.



ఆర్‌బికె సిబ్బందికి సూచనలు ఇస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

ఆర్‌బికెలో సబ్‌కలెక్టర్ పరిశీలన

పాలకొండరూరల్ : మండలంలోని వాటపాగులోని ఆర్‌బికె, సచివాలయాన్ని సబ్ కలెక్టర్ నూరూల్ కమర్ సోమవారం సందర్శించారు. సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రతి ధాన్యం గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. గోనె, హమాలి, రవాణా చార్జీలు ప్రభుత్వమే అందిస్తుందన్నారు. అనంతరం వాటపాగు ఎంపిపి స్కూల్ తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు.

దబ్బగెడ్డలో ఆరోగ్య తనిఖీలు

మక్కువ : మండలంలోని పిహెచ్‌సి పరిధిలోని దబ్బగెడ్డ పంచాయతీలో సోమవారం వైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. ఇప్పటికే గ్రామంలో చాలావరకు ప్రజలు వైరల్ జ్వరాలతో బాధపడుతున్నారు. స్థానిక రామాలయం వద్ద వైద్య సిబ్బంది ఆరోగ్యమేళా కార్యక్రమం చేపట్టారు. దాదాపు 50 మందికి పైగా రక్త పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అలాగే బిపి, షుగర్, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు కూడా జరిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శైలజ, సింహాచలం, స్థానిక ఆశా వర్కర్ అనసూయ, హెల్పర్ మంగమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కురుకూటి హెచ్‌ఎం కృష్ణారావును సస్పెండ్ చేయాలి

కలెక్టరేట్ : విద్యార్థినిలను లైంగిక వేధింపులకు గురిచేసిన సాలూరు మండలం కురుకూటి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావును చట్ట ప్రకారం అరెస్ట్ చేయాలని, శాఖా పరంగా సస్పెండ్ చేయాలని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంఘం నాయకులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్, ఆరిక ప్రభాకర్ ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్‌ను కోరారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో పిఒను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ ఉదంతం వెలుగుచూసి మూడు నెలలైనా హెచ్‌ఎంపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని విచారణ వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ మంగళవారమే కృష్ణారావును సస్పెండ్ చేస్తామని తెలిపారు.

టీచర్ల పని సర్దుబాటు రద్దు చేయాలి

పార్వతీపురం టౌన్ : ఉపాధ్యాయుల బదిలీలు షెడ్యూల్ ప్రకటించిన తర్వాత వర్క్ అడ్జస్ట్మెంట్ చేయడం సరికాదని, వెంటనే రద్దు చేయాలని ఎపి ఎస్‌సి, ఎస్‌టి ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సామల సింహాచలం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ నిర్వహించేందుకు కౌన్సిలింగ్ షెడ్యూల్‌ను విద్యాశాఖ విడుదల చేసిందన్నారు. అయితే వర్క్ అడ్జస్ట్మెంట్‌ను కూడా అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేయడం వల్ల టీచర్లు ఆందోళన చెందుతున్నారని అన్నారు. కావున, వర్క్ అడ్జస్ట్మెంట్ రద్దు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యాశాఖ కమిషనర్‌కు లేఖ రాసినట్లు సామల పేర్కొన్నారు.

నిబంధనలు పాటించకుంటే చర్యలు

మక్కువ: ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని జిల్లా వృత్తి విద్యాధికారి మంజులవీణ అన్నారు. సోమవారం మానిటరింగ్ కమిటీ మండల కేంద్రంలోని ప్రైవేట్ కళాశాలను తనిఖీ చేసింది. ఈ సందర్భంగా కళాశాలలో రికార్డులను పరిశీలించి, విద్యార్థినిలకు అందిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. తరగతి గదులను, ల్యాబ్‌లను, మరుగుదొడ్లను పరిశీలించారు. కార్యక్రమంలో మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు

బాలేరులో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

భామిని : బాలేరు పిహెచ్‌సి పరిధిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకొని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయ, డాక్టర్ దీపికరాణి ఆధ్వర్యంలో హైపర్ టెన్షన్, మధుమేహ వ్యాధి గ్రాస్తులుకు హెల్త్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బాలేరు ఎంపిటిసి సభ్యులు కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ జామి ప్రభాకర్ ప్రారంభించారు. రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి, నెలకు సరిపడా మందులు అందజేసి, ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

పార్వతీపురం రూరల్ : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో 2023 -24 సంవత్సరం పంచాయతీల అభివృద్ధి ప్రణాళికపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం సోమవారం స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ప్రారంభించారు. సర్పంచులు, సచివాలయ సిబ్బంది శిక్షణ కార్యక్రమంపై అవగాహన పెంచుకొని పంచాయతీల అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్ ఎంపిపి సిద్ధ జగన్నాధరావు, పూడి శంకరరావు, ఎంపిడిఒ అఖిబ్ జావేద్, సర్పంచులు ఎంపిటిసి సభ్యులు, సచివాలయ సహాయకులు పాల్గొన్నారు.

పట్టణంలో అన్నదానం

పార్వతీపురం టౌన్ : స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ఉన్న శ్రీభవాని మాతగుడి ఆరో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కమిటీ సభ్యులు భారీ అన్నదానం నిర్వహించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ బెలగాం జయప్రకాష్ నారాయణ (జయబాబు) చేతులమీదుగా కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో పట్టణ పరిధిలో ఉన్న అన్ని వార్డుల్లో గల ప్రజలతో పాటు, పట్టణానికి పలు రకాల పనులపై గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఈ భారీ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ జయబాబు

కార్మికులకు అండ సిఐటియు జెండా

- నేడు, రేపు పార్వతీపురంలో నేడు10వ మహాసభ
- మార్కెట్‌యార్డు వద్ద బహిరంగ సభ, ప్రదర్శన

కార్మికులకు అండగా... శ్రమజీవులకు వెన్నుదన్నుగా అనేక పోరాటాలు, ఎన్నో విజయాలు, మరెన్నో ప్రగతిశీల లక్ష్యాలతో ముందుకు సాగుతున్న సిఐటియు మరో అడుగు ముందుకు వేస్తోంది. ఓవైపు పెట్టుబడిదారులు, కార్పొరేట్‌శక్తుల శ్రమదోపిడీ, ఉద్యోగులపై వేధింపులు పెరుగుతుండగా, మరోవైపు ఎర్రజెండా నీడలో సిఐటియు ఆధ్వర్యాన జిల్లాలో పోరాటాలు ఉవ్వెత్తున సాగుతున్నాయి. ఇటువంటి సందర్భంలో సిఐటియు జిల్లా 10వ మహాసభలకు పార్వతీపురం మన్యం జిల్లా సిద్ధమైంది. మంగళ, బుధవారాల్లో పార్వతీపురం పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఈ మహాసభ జరుగనుంది. దీనికి ముందుగా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి సభా వేదిక వరకు కార్మికులు భారీ ప్రదర్శన నిర్వహించనున్నారు. బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సిహెచ్.నర్సింగరావు, కె.సుబ్బరావమ్మ ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో బహిరంగ సభ, ప్రతినిధుల సభ జరగబోయే ప్రదేశాలు సిఐటియు జెండాలతో ఎర్రబారాయి. కార్మికుల హడావుడితో పండగ వాతావరణం నెలకొంది. మహాసభల నేపథ్యంలో సిఐటియు చేసిన పోరాటాలు, విజయాలు ఒక్కసారి గుర్తు చేసుకుందాం

ప్రజాశక్తి-పార్వతీపురం/కలెక్టరేట్

కొత్తగా మన్యం జిల్లా ఆవిర్భావంతో పారిశ్రామికంగా మరింత వెనుకబడింది. పాలకుల పుణ్యమా అని జిల్లాలో సుగర్, జ్యూట్, చిన్నా చితక పరిశ్రమలు మూతపడడంతో సుమారు 20వేల మంది ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వమే ఇసుక వ్యాపారం మొదలెట్టిన తరువాత నిర్మాణ రంగ కార్మికులు చాలా వరకు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో 50వేల మంది భవన నిర్మాణ కార్మికులు పనుల్లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారు. అన్ని రంగాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. మరోవైపు రెండో ఎఎన్‌ఎం, విఆర్‌ఎలు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం తదితర స్కీమ్ వర్కర్ల సమస్యలైతే అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం అవలంభిస్తున్న మోసపూరిత విధానం వల్ల ఉద్యోగ భద్రత, పనికి తగ్గ వేతనం లేదు. పని ఒత్తిడి ఎక్కువైంది. బండెడు చాకిరీ మోస్తున్నా రాజకీయ వేధింపులు తప్పడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో వీరందరికీ సిఐటియు అండగా నిలుస్తూ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోంది. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవల్ల జరుగుతున్న కష్టనష్టాలను కార్మికవర్గానికి వివరిస్తూ, చైతన్యపరుస్తూనే సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను తీవ్రతరం చేసింది.

పోరాటాలు... విజయాలు

జిల్లాలో 2019 నుండి 2022 మధ్యకాలంలో మున్సిపల్ కార్మికులు విస్తృత పోరాటాలు చేశారు. హెల్త్ ఎలవెన్సు బకాయిలు, 151 జీవో అమలు, కరోనాతో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇప్పించడం, పారిశుద్య కార్మికులను సచివాలయాలకు అప్పగించాలన్న ప్రభుత్వ నిర్ణయానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పార్వతీపురం, సాలూరు, పాలకొండ పట్టణాల్లో పోరాటం నడిచింది.

సాలూరులో మున్సిపల్ మహిళా ఉద్యోగినిపై సహ ఉద్యోగి లైంగికంగా వేధిస్తే శ్రామిక మహిళా కమిటీ (ఐద్వా) సహకారంతో పెద్ద ఎత్తున పోరాటం చేయగా, కలెక్టర్ స్పందించి ఐసిడిఎస్ పీడీతో కమిటీ వేసి విచారణ చేయించారు. వేధించిన ఉద్యోగిని సస్పెండ్ చేశారు. పాలకొండ మున్సిపల్ కమిషనర్ ప్రమోషన్లు ఇస్తామని కాంట్రాక్టు వర్కర్లు 21మంది నుంచి రూ.14లక్షలు లంచం తీసుకోగా, దీనిపై పోరాడి తిరిగి రికవరీ చేయించారు. జిల్లాలో 12 మండలాల్లోని 1700 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు ఉన్నారు. వీరికి జీతాలు సకాలంలో ఇవ్వాలని, బకాయి వేతనాలు చెల్లించాలని, ఆశాలుగా గుర్తించాలని రెండు రోజుల పాటు ఐటిడిఎ ముట్టడించారు.



బహిరంగసభకు ముస్తాబైన వేదిక

విజయం సాధించిన మైతాన్ కార్మికుల పోరాటం

బొబ్బిలి గ్రోత్ సెంటర్లో మైతాన్ కార్మికులు తొలగింపుపై పెద్ద ఎత్తున పోరాటం జరిగింది. పోలీసులు, స్థానిక ఎంఎల్‌ఎ, ప్రభుత్వం యాజమాన్యానికి అండగా ఉండడం వల్ల కార్మికులపైనా, నాయకులపైనా తప్పుడు కేసులు పెట్టి సెంటర్ జైలుకు తరలించారు. రాష్ట్ర, స్థానిక నాయకత్వాల ఆధ్వర్యంలో 40 రోజుల పాటు నిరసన దీక్షలు జరిగాయి. ఆఖరుకు యాజమాన్యం కార్మికులను పనిలో పెట్టుకోవడానికి అంగీకరించింది.

పెరిగిన నిర్బంధాలు

సమస్యలపై పోరాడుతున్న కార్మికుల పట్ల పోలీసుల నిర్బంధం ఎక్కువైంది. అక్రమంగా తప్పుడు కేసులు పెడుతున్నారు. సాలూరు మండలం మరిపిల్లికి చెందిన యువకుడు చేయి విరిచినా పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అడిగినందుకు ప్రజాసంఘాల నాయకులు మర్రి శ్రీనివాసరావు, యమ్మల మన్మధరావుపై తప్పుడు కేసులు పెట్టి 10 రోజులు రిమాండ్‌లో ఉంచారు. అయినప్పటికీ వెనుకంజ వేయకుండా కార్మిక సమస్యలపై పోరాటంలో సిఐటియు ముందుకు సాగుతోంది.

ప్రజా సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

ప్రజలకు సంక్షేమం సమకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. సోమవారం మండలంలోని డోలమడ సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లిన గడిచిన మూడేళ్లలో వైసిపి పభుత్వం అందిస్తున్న సంక్షేమ లబ్ధిని ప్రజలకు వివరించారు. ఇందుకు సంబంధించిన బుక్లెట్లను లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ బిడ్డిక నాగమ్మ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : మండలంలోని డికెపట్నం సచివాలయం పరిధిలోని గోచక్కలో గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎ.జోగారావు ఇంటింటికీ వెళ్లి నవరత్నాల లబ్ధిదారులను కలుసుకున్నారు.కార్యక్రమంలో సర్పంచి ఉదయాన శకుంతల, ఎంపిపి మజ్జి శోభారాణి, జెడ్‌టిసి బలగ రేవతమ్మ, ఎఎంసి చైర్పర్సన్ ఎం.భాగ్యలక్ష్మి, నాయకులు బొమ్మి రమేష్, భీమవరపు కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



పథకాల అమలును ప్రజలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

సీతానగరం : మండలంలోని అంటిపేట పంచాయతీ వెన్నెల బుచ్చంపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎ.జోగారావు మాట్లాడుతూ ఏవైనా సమస్యలు ఉంటే తెలుసుకొని పరిష్కరించే దిశగా అడుగులు వేయడం చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.మహేష్, ఉపసర్పంచ్ బి.తిరుపతిరావు, ఎంపిపి బి.రవణమ్మ, శ్రీరామునాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, వైసిపి మండల నాయకులు బి.చిట్టిరాజు, ఆర్‌వి పార్థసారథి, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో 'ఇదేం కర్మ'

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని గాటి గుమ్మడ, గుమ్మడ, దబర, దంజుపాయి, కోసంగి గ్రామాల్లో "ఇదేం కర్మ మన రాష్ట్రానికి " కార్యక్రమం పాలకొండ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యాన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ వైసిపి ఆగాడాలు, భవిష్యత్తు ఎపికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని, ప్రాంతీయ పేరుతో విభేదాలు, రాష్ట్ర భవిష్యత్తు కోరుకునే ప్రజలు వాస్తవాలు గ్రహించాలని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సవరతోట ముఖ లింగం, రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యదర్శి బిడ్డిక చందరరావు, తదితరులు పాల్గొన్నారు.

జియ్యమ్మవలస: మండలంలోని శిఖబడిలో ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం జరిగింది. ఈ క్యాక్రమానికి ముఖ్యఅతిథిగా



గ్రామస్తులకు ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తున్న జయకృష్ణ

పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలు చేపడుతున్న వైసిపి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పడానికి రానున్న రోజుల్లో ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ టి.జగదీశ్వరి, అరకు పార్లమెంట్ టిడిపి అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, మండల అధ్యక్షులు పల్ల రాంబాబు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలం లోని పెదపెంకి పంచాయతీ బైరిపురం లో ఇదేమి కర్మ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవిలు మాట్లాడు తూ వైసిపి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందని, రాబోయే రోజుల్లో జగన్‌ను గద్దిదించే ఆలోచనలు ప్రజలు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పెంకి వేణు గోపాల నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు వాడాడ రాము, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు తయారు చేసుకోవాలి

ప్రజాశక్తి - సీతానగరం

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఎంపిడిఒ బి.కృష్ణమహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం పంచాయతీల అభివృద్ధికి సర్పంచ్, మండల స్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రణాళికలతోనే పంచాయతీల ఆదాయ, వ్యయాలు చేయాలన్నారు. ముందుగా ఆర్థిక వనరులను గుర్తించి తద్వారా గ్రామాల అభివృద్ధికి ప్రణాళిక తయారు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎఒ ఎంఎస్‌ఎన్ ప్రసాద్, ఎంపిపి బి.రమణమ్మ, శ్రీరాములు నాయుడు, జెడ్‌పిటిసి సభ్యులు ఎం.బాబ్జీ, ఇఒపిఆర్‌డి కెకె వర్మ, ఎపిఎం ఆర్.శ్రీరాములు, ఎంఇఒ జి.సూర్యదేవుడు, వివిధ పంచాయతీల, సర్పంచులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

గుమ్మలక్ష్మీపురం : రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ఏజెన్సీ జర్నలిస్టుల అసోసియేషన్ నాయకులు బి.కుమార్, పైడా కొండలరావు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులు ఇవ్వాలని, ఆరోగ్య భీమా కొనసాగించాలని, ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, ఏజెన్సీలోని విలేకరులకు కూడా పల్లప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరారు. విశ్రాంత జర్నలిస్టులకు పింఛన్ మంజూరు చేయాలన్నారు.

నిధుల వినియోగంపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - కొమరాడ

ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కేటాయిస్తున్న నిధుల ఖర్చుపై అవగాహన అవసరమని ఎంపిడిఒ ఎస్.సురేష్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిపిడిపి, బిపిడిపి, డిపిడిపి 2023-24 ఏడాదికి సంబంధించి ప్రణాళికల శిక్షణా తరగతులు రెండో రోజు నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ ఎస్.రమేష్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. రెండో రోజు జిపిడిపి శిక్షణ నిమిత్తం 7 గ్రామపంచాయతీల్లో 2 ఎంపిటిసిలు, లైన్ డిపార్ట్మెంట్స్ సచివాలయ సిబ్బంది వివిధ అధికారులతో వారి యాక్షన్ ప్లాన్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రభుత్వం అభివృద్ధి కోసం విడుదల చేస్తున్న నిధులను ఏఏ అభివృద్ధి పనుల కోసం ఎంతవరకు ఖర్చు చేయాలనే అంశంపై వివరించారు. ప్రభుత్వం వివిధ నిధులను అభివృద్ధి కోసం కేటాయిస్తున్న విషయంపై అవగాహన కల్పించారు. అలాగే ఏ అవసరాల కోసం ఏ నిధులను ఉపయోగించవచ్చు ఏ మేరకు ఖర్చు చేయొచ్చు అన్న అంశం ప్రజా ప్రతినిధులకు వివరించారు. ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేసేందుకు నాడు నేడు నిధులు చాలా దోహదపడతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలకు అభివృద్ధి కోసం వస్తున్న నిధులను ఏ విధంగా వినియోగించుకోవాలనే అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం నాలుగు రోజులు పాటు జరిగే శిక్షణా తరగతులను ప్రజాప్రతినిధి పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు మండల స్థాయి అధికారులు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - సీతానగరం

రైతుల నుంచి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు స్థానిక తహశీల్దార్ ఎంవి రమణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని చెప్పినప్పటికీ ఆచరణలో ఎక్కడా అమలు కావడం లేదన్నారు ఇటీవల అకాల వర్షాలతో ధాన్యం శాతం తక్కువగా ఉందని రైతుల నుంచి ధాన్యం తీసుకోవడంలేదన్నారు. తీసుకుంటే మిల్లి యజమానులు, కళాసీలు, కూలీలు అధిక రేటు ఇమ్మని చెప్పడం దుర్మార్గమన్నారు. రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర లేదని తీరా పంటను అమ్ముకోలేని పరిస్థితి ఈ ప్రభుత్వం తీసుకొచ్చిందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకటనలకే తప్ప ఈ ప్రభుత్వం రైతు సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. తక్షణమే రైతుల నుంచి నేరుగా ధాన్యాన్ని కొనుగోలు చేసి సకాలంలో బిల్లులు చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. వినతిని అందజేసిన వారిలో రైతు సంఘం నాయకులు బి.అప్పారావు, సత్యంనాయుడు, పోలినాయుడు తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ అధికారికి వినతిని అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

పాచిపెంట : రైతుల నుంచి ధాన్యం తక్షణమే కొనుగోలు చేయాలని రైతుసంఘం మండల కార్యదర్శి బోను గౌరి నాయుడు, ఉపాధ్యక్షులు బూర వెంకన్న మండల రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ ఉదయ్ కుమార్ వినతిని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు డి.సింహాచలం, బి.పాపయ్య, సిఐటియు నాయకులు కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.



కురుపాంలో ర్యాలీ చేస్తున్న తెలుగుయువత

యువత భవిష్యత్తును పోలీసులే కాపాడాలి

ప్రజాశక్తి - కురుపాం

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్, మత్తు పదార్థాలకు బానిసలుగా వైసిపి ప్రభుత్వం తయారు చేస్తుందని వాటి నుంచి యువతను పోలీసులే కాపాడాలని టిడిపి రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక టిడిపి కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు వావిలాపల్లి దివాకర్ ఆధ్వర్యంలో ర్యాలీ జరిగింది. ఈ ర్యాలీని ఉద్దేశించి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యువత పూర్తిగా పాడైపోయిందని, ఇందుకు వారికి ఉపాధి అవకాశాలు కల్పించకపోవడమేనని అన్నారు. జగన్ రెడ్డి ప్రభుత్వం యువతను డ్రగ్స్, గంజాయికి బానిసలయ్యేలా చేసి వారి జీవితాలను అగమ్య గోచరంగా చేశారని, వీటిని అరికట్టి యువత భవిష్యత్‌ను కాపాడాలంటే పోలీసులు వల్లే సాధ్యమవుతుందని అన్నారు. అనంతరం ఎస్సై ప్రసాద్‌కు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కెవి కొండయ్య, టిఎన్‌ఎస్‌ఎఫ్ మీడియా కోఆర్డినేటర్ సుకేశ్ చంద్ర పండ నియోజకవర్గంలోని గల తెలుగు యువత పాల్గొన్నారు.

30న నందమూరి స్మారక పురస్కారాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఈనెల 30న పద్మశ్రీ నందమూరి తారక రామారావు స్మారక పురస్కారాల ప్రధానోత్సవం విశాఖ జిల్లా పౌర గ్రంథాలయంలో జరుగుతోందని దాసరి నారాయణరావు కల్చరల్ అకాడమీ, విశాఖ రత్న కళాపరిషత్ అధ్యక్షులు పిఎ భాస్కరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్టీయార్ శతజయంతి ఉత్సవాలు సందర్భంగా ప్రతి నెలా పురస్కారాల ప్రధానం చేస్తున్నామన్నారు. ఈనెల 30న 8వ కార్యక్రమం జరుగుతుందని ఈ పురస్కారాల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన కళా, వైద్య, నాటక, పౌరాణిక, సాహిత్య రంగాల్లోనూ, సామాజిక సేవ, కవులు, రచయితలు నాట్య, ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సేవా రంగాల్లో ప్రతిభావంతులను గుర్తించి ఆసక్తి ఉన్నవారు 9 8 4 8 4 8 17 67 నంబర్ కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు.

శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి -బలిజిపేట

విద్యార్థులను భావిభారత శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దాలని స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎగ్జిబిషన్ డే జరిగింది. ఈ ప్రదర్శనలో బలిజిపేటతో పాటు చిలకలపల్లి, అరసాడ, అజ్జాడ, పెదపెంకి, నారాయణ నాయుడు వలన, వంతరాం, నారాయణపురం, కెజిబివి పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి పెంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించనున్న మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు విద్యార్థులు పలు ప్రాజెక్టులు తయారు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లో మండలంలోని 10 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు కెజిబివి, గంగంపేట గిరిజన ఆశ్రమ పాఠశాల కూడా పాల్గొంటాయని నోడల్ అధికారి దూషి నాగమణి తెలిపారు. ప్రతి పాఠశాల నుండి 5 బృందాలు పాల్గొంటున్నాయి.

కొమరాడ : విద్యార్థుల మేధస్సు శక్తిని వెలికి తీయాలని ఎంఇఒ జామి నారాయణస్వామి అన్నారు. సోమవారం సైన్స్‌ఫైర్ కార్యక్రమం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలు వారి వారి ప్రాజెక్టులతో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చదువుకుంటున్న పిల్లల్లో సైన్స్‌పై భయం వీడేలా ఎగ్జిబిషన్లో నిర్వహిస్తే వారి మేధాశక్తి బాగా పెరుగుతుందన్నారు. పిల్లలకు చిన్న స్థాయి నుంచే సైన్స్‌పై అవగాహన కల్పిస్తూ వారిని భావితరాలకు వీచి దిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. పిల్లల్లో అంతర్గత శక్తులు సృజనాత్మకత ఉంటాయని, వాటిని వెలికి తీయడం ఇలాంటి సైన్స్‌ఫేర్‌ల ఉద్దేశమని చెప్పారు.

అపరాల అధిక దిగుబడికే పొలంబడి

పాచిపెంట : ఆరోగ్యవంతమైన అధిక దిగుబడు లక్ష్యంగా మిత్ర పురుగులను సంరక్షించుకుంటూ నిరంతర పంట విశ్లేషణ ద్వారా విత్తనం నుంచి విత్తనం వరకు పంటపై పూర్తి పరిజ్ఞానాన్ని రైతుకు అందించడమే పొలంబడి లక్ష్యమని మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని చెరుకుపల్లిలో ప్రకృతి సేద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంబడి రైతులను ఉద్దేశించి మాట్లాడారు. అపరాలను తప్పనిసరిగా బీజామృతం, ఇమిడా క్లోప్రిడ్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలని, వరి కోతకు ముందే ఎకరాకు 12కిలోల విత్తనాలు చల్లుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రకృతి సేద్య ప్రతినిధులు యశోదమ్మ, విఎఎ నాగమణి పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న పిఒ నవ్య

ఐటిడిఎ స్పందనకు 36 వినతులు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ స్పందన కార్యక్రమాన్ని పిఒ బి.నవ్య సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 36 అర్జీలు వచ్చాయి. వీటిలో మాలువకు చెందిన కోర్రాయి పూజ విద్యుత్ స్తంభాలు మంజూరు చేయాలని వినతి సమర్పించారు. ఇళ్ల స్థలం చదును చేయాలని హడ్డుంగికి చెందిన రామకష్ణ విన్నవించారు. వితంతువు పెన్షన్ మంజూరు చేయాలని తిరుప గ్రామానికి చెందిన సవర జ్యోతి కోరారు. వజ్జాయిగూడకు చెందిన రమేష్ రెండు నెలలుగా రేషన్ అందడం లేదని విన్నవించారు. కొండసీపుర్లుకు లోను ఇప్పించాలని కొమ్మల గోడకు చెందిన కామేశ్వరరావు కోరారు. బొండి గ్రామానికి చెందిన హారిక మణిబాబు తాగునీరు బోరు మోటర్ మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఒ రోషిరెడ్డి, ఎటిడబ్ల్యుఒ మంగవేణి, సిడిపిఒ రంగలక్ష్మి తదితర అధికారులు పాల్గొన్నారు.

పాఠశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఉదయపురం పంచాయతీ ఉదయపురం కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు నాడు నేడు ద్వారా రూ.12 లక్షల నిధులతో మంజూరైన అదనపు తరగతుల భవన నిర్మాణ పనులకు ఎంపిపి శెట్టి పద్మావతి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలకు భవనంతో పాటు కాంపోనెంట్ కింద మరో రూ.12లక్షలతో కాంపౌండ్ వాల్, తాగునీరు, కుర్చీలు, బెంచీలు, బాత్రూములు, తదితర మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్యను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అరుణ, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, వైస్ ఎంపిపి రంగారావు, వైసిపి మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.